# మతం మారినా....

శ్రీమతి వి. ప్రభావతిగారు

అప్పుడే తెల్లవారుతోంది. కిటికీలోనుంచి ఒక వెలుగు కిరణం లీల ముఖం మీద పడింది—లీలకు మెళుకువవచ్చింది. నిద్ర కళ్ళతోనే కిటికీలోనుంచి బయటకు చూసింది. వికసించిన మందార పువ్వులు ఆమెను పలుకరించాయి. ఒక్క క్షణం ఆమె హృదయం ప్రశాంతతతో నిండింది.

ఉన్నట్లుండి మిన్ను విరిగి మీదపడినట్లు వదినగారు రాజేశ్వరి కేకలు లీల చెవిని పడ్డాయి. వెంటనే లేచి మేడ దిగివచ్చింది.

లీలకు చిన్నతనంలో తలిదండ్రులు పోయారు. అన్న వదినల దగ్గరే పెరిగి పెద్దదైంది. లీలకు యుక్తవయస్సు వచ్చింది. అన్నగారు నారాయణరావు లీల విషయంలో నిరసనగావుంటున్నాడు. ఆమె దగ్గరలోవున్న స్కూలుకు వెళ్ళి చదువుకుంటూవుండేది. రెండవ ఫారం పూర్తి చేసింది. ఇంతలో వయస్సు వచ్చిన పిల్లలకు యింకా చదువేమిటని వదినగారు రాజేశ్వరి సాదింపు మొదలు పెట్టింది. అన్నగారు కూడా తాళంవాయించాడు. లీల చదువు మానేసింది. కాని ఆమెకు వివాహం చెయ్యాలన్న ఆలోచన వారిద్దరికీ కలగ లేదు.

ఒక రోజు మధ్యాహ్నం లీల యేదో పుస్తకం చేత్తో పట్టుకుని కూర్చుని పరధ్యాన్నంగా తనకు తెలియకుండానే పేజీలు త్రిప్పుతోంది.

"లీలా నాజేబురుమాలు చూశావా"

లీల అదిరి పడింది.

"చూడలేదన్నయ్యా, నీ జేబురుమాలు నాకేం తెలుసు."

"చూడ లేదు, కానీ యిప్పుడు చూడాలి. నెలకు రెండు డజన్లు కొనుక్కుంటాను. కానీ సమయానికి వొక్కటైనా కనబడదు. ఆ మాత్రం జాగ్రత్త పెట్టలేవు? చేసే పనేముంది?

వదినగారు భావి దగ్గర నుంచి మొదలు పెట్టింది పంచమ స్వరంలో "ప్రొద్దస్తమానమూ ఆ పుస్తకం పట్టుకుని కూర్చోక పోతే ఆయనకు కావలసిన వేవో కనుక్కుని సమయానికి అందియ్య లేవు? నేనీ వంట పనిలో వున్నాకదా, ఆ మాత్రం ఆశ లేకపోతే యెందుకు నువ్వీయింట్లో?"

అలమారలోని యిస్త్రీ బట్టలు, బుట్టలోని మాసిన బట్టలు అన్నీ బయటికి వచ్చిన తరువాత జేబురుమాలు అతని జేబులోనే దొరికింది.

"నా చెప్పు లేవీ"—"కొంచెం యివన్నీ చూడ కూడదూ పుస్తకం చేత్తో పట్టుకు నిద్రపోకపోతే?"

ఇది మామూలు పాఠమే. ఇదంతా లీలకు కంఠతావచ్చు. రోజు రోజూ జాగ్రత్తగా వుండాలనుకుంటుంది. పాపం! మరచి పోతూవుంటుంది.........గది, అంతా అరణ్యంలా వుంది.

చుట్టూ యిస్త్రీ బట్టలు, మాసిన బట్టలు, పుస్తకాలు, న్యూస్ పేపర్లు, తాను మధ్య కూర్చునివుంది. వంట యింట్లో వదినగారి రుస రుసలు వినిపిస్తున్నాయి. తన చుట్టూ వున్న వన్నీ తన్ను చూసి జాలిపడుతున్నంట్లుంది. రెండు కన్నీటి చుక్కలు కార్చింది—ఓదార్చేవారెవరు?

నిమ్మదిగా లేచి యిల్లంతా సర్దింది. కిటికీ దగ్గర నిల్చుంది. ఎండ మాడిపోతోంది. తోటలోని చెట్లన్నీ యెండకు తట్టుకోలేక, తప్పించుకోలేక వాడిన ముఖాలతో ఆయాసపడుతున్నాయి. ఎండలో ప్రాణాలు నిల్పుకో లేమని తలలు వాల్చేస్తునాయి. లీల యిదంతా బాధతో చూస్తోంది.

సూర్యుడు దయదల్చి చల్లపడ్డాడు.

మధ్యాహ్నంన్నించీ రాజేశ్వరి నోరు వాగుతూనేవుంది.

"లీలా, రాత్రికి మీ అన్నయ్యకు పాలల్లోకి పంచదార లేదు కాస్త ముందుగా చూసి చెప్పకూడదూ?"

"కొళాయి గొట్టం బిగుసుకుపోయింది. నీళ్ళు రావటం లేదు. జ్ఞాపకం వుంచుకుని మీ అన్నయ్య వెళ్ళేటప్పుడు చెప్పలేక పోయావా? అన్నిటికీ నేనే యేడ్చుకోవాలా?"

చిన్న చిన్న విషయాలను పెద్ద పెద్ద సమస్యలుగా తయారు చేయటంలో రాజేశ్వరిది అందె వేసిన చెయ్యి.

★ హృదయం మారదు ★

# మతం మారినా....

అయినా యీ చిన్న చిన్న విషయాలే మనస్సుకు యెంతో బాధను యిబ్బందిని కలిగిస్తాయి............

సాయంత్రం మబ్బుగావుంటే లీల వర్షం కురుస్తుందేమో ననుకుంది. కానీ మబ్బులన్నీ విడిపోయి వెన్నెల వచ్చింది. ఆ రాత్రి డాబామీద నక్షత్రాల కేసి చూస్తూ పడుకుంది లీల. ఆమెను నిత్యజీవితంలో బాధిస్తున్న సమస్యలన్నీ వొక్కపెట్టున జ్ఞప్తికి వచ్చాయి. ప్రతిరోజూ యేదోమార్పు వస్తుందని భ్రమ, రోజులన్నీ అల్లాగే గడిచిపోతున్నాయి. కానీ యీ రోజు ?......

తెల్లవార్లూ అల్లాగే నక్షత్రాలను చందమామనుచూస్తూ గడపగలదా ?...

తెల్లవారింది. లీల కనబడలేదు. రాజేశ్వరి మనస్సు పది విధాలుగా పరుగెత్తింది. వయస్సువచ్చినపిల్ల...అంది. కాని అన్నగారు నారాయణరావు మాత్రం కలవరపడ్డాడు. రక్త స్పర్శకదూ. ఎంతో బాధపడ్డాడు. కానీ యేంచేస్తాడు. కాలచక్రం తిరిగిపోతోంది.

కొన్ని సంవత్సరాలు గడిచాయి.

ఒకరోజు మధ్యాహ్నం విశాఖపట్టణం గవర్నమెంటు ఆస్పత్రిలో నర్సులు వొకగదిలోంచి మరొకగదిలోకి తొందరగా పరుగులెత్తుతున్నారు. అప్పుడే ఒక నర్సు తన గదిలోంచి మల్లెపువ్వులాంటి తెల్లని దుస్తులతో బయటికి వచ్చింది.ఆరోజు డ్యూటీలో ప్రవేశించటానికి మిగిలిన నర్సుల కలవరపాటు చూసింది. అటుపోతున్న ఒక నర్సును ఆపి,

"డోరతీ, ఏమిటీ తొందర ? ప్రమాదంలోవున్న కేసేదైనా వచ్చిందా ?"

"అవును లైలా, చాలా ప్రమాదం. ఎవరో ఒకామె ప్రసవవేదనపడుతోంది. రెండురోజులనుంచీ బాధపడుతోందిట. ఇప్పుడే తీసుకువచ్చారు" అని వెళ్ళిపోయింది. లైలా కూడా ఆమె వెంటనే వెళ్ళింది......

లైలా ఆమెకు దగ్గరగానే కూర్చునివుంది. ఆమె ప్రసవమై రెండుగంటలసేపైంది. మగపిల్లవాడు పుట్టాడు. లైలా ఆమె ముఖంలోకి రెప్పవాల్చకుండా చూస్తోంది. లైలా మనసులో యేదో మెరుపు మెరిసినట్లయింది. ఆమె నిమ్మదిగా కళ్ళు విప్పిచూసింది.

"నీపేరేమిటమ్మా ?"

"మిస్ లైలా"

"నీ ఋణం తీర్చుకోలేనమ్మా. నాకు ప్రాణం పోశావు."

లైలాముఖం ప్రక్కకు తిప్పుకుంది. ఆమెకు ఎన్నడో మరచినవి యేవో జ్ఞప్తికి వస్తున్నాయి.

ఇంతలో ఆమెభర్త అక్కడికి వచ్చారు. లైలాలేచి ప్రక్కకు తొలిగింది. ఆమె, భర్తతో.

"ఈమె ఋణం మనం తీర్చుకోలేమండీ. ఈమే నన్ను బ్రతికించింది. పేరు లైలాట."

ఆయన లైలా వంకచూశాడు. అల్లాగే నిలబడిపోయారు. అతను అప్రయత్నంగా అన్నాడు.

"లైలాకాదు లీల !"

"అన్నయ్యా" అని తలవంచేసుకుంది లీల.

"..." ఏమిటీ, యీమె మన లీలా ? అంటూ లేచింది రాజేశ్వరి ఆశ్చర్యంతో.

"లీలా"

"వదినా ?"

"లీలా, నన్ను క్షమించవూ ? నేను నీకు తీరని అపకారంచేశాను. దానికితోడు యిప్పుడు నీవు నాకుచేసిన మహోపకారంతో నేను నీకెంతో ఋణపడివున్నాను లీలా"—

ఐదురోజులైంది.

రాజేశ్వరి ఆరోగ్యవంతురాలైంది. ఆమెను ఆస్పత్రినుండి తీసుకు వెళ్ళిపోవచ్చునని చెప్పారు. ప్రయాణమవుతున్నారు. లైలా అక్కడకు వచ్చింది. అన్నగారిని చూసింది.

"లీలా మాతో వచ్చెయ్యవూ ?"

"అన్నయ్యా..." ఇక మాట్లాడలేకపోయింది.

రాజేశ్వరి లీలదగ్గరకు వెళ్ళి లీలా, నన్ను క్షమించవూ ? నీ ఋణం నేను తీర్చుకోలేను. మాతో—

"వదినా, ఇందులో నేను మీకుచేసిన మహోపకారం ఏమీలేదు. మతం మార్చుకున్నా నా విధికృత్యాన్ని నెరవేర్చాను. నన్నీ ప్రశాంత వాతావరణంలో బ్రతకనియ్యి" అని వెనక్కి తిరిగింది లీల.

★